నవతెలంగాణ
ఆదిలాబాద్
బుధవారం | మే 22, 2024 | www.navatelangana.com

వరి కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని గడ్‌చాంద, నగర్ గ్రామాల్లోని డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు తెలియజేశారు. లారీల కొరత లేకుండా చూడాలని, వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని, వరి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, ఆర్ఐ బాలకిషన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిన దుకాణం పరిశీలన

నవతెలంగాణ-ఇచ్చోడ



మండల కేంద్రంలోని పురాణం లచ్చన్న దుకాణం సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటు చేసుకుంది. దుకాణం దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న పరిశీలించి, దుకాణ యజమాని లచ్చన్నను పరామర్శించారు. ఈ సందర్భంగా నష్ట పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. వారి వెంట మండల నాయకులు ముండే పాండురంగ్, గాడ్గే సుభాష్, రమేష్, వెంకటేష్ ఉన్నారు.

కార్పొరేషన్ దిశగా మంచిర్యాల..?

- పావులు కదుపుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు
- నస్పూర్ మున్సిపాలిటీ, పలు గ్రామాల విలీనం
- పెరగనున్న వ్యయ ప్రమాణాలు

మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్ కానుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీని కోసం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ ఏర్పాటుకు కావల్సిన జనాభా, భౌగోళిక అంశాలు తక్కువ ఉండటంతో నస్పూర్ మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని పలు గ్రామాలను విలీనం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో మంచిర్యాల కార్పొరేషన్ ఏర్పాటుకు సంస్థాగతంగా సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది.



నవతెలంగాణ-హాజీపూర్

మున్సిపల్ కార్పొరేషన్ అనేది భారతదేశంలోని ఒక రకమైన స్థానిక ప్రభుత్వం ఎక్కువ జనాభా కలిగిన పట్టణ ప్రాంతాలను ఎంపిక చేస్తుంది. పెరుగుతున్న జనాభా పట్టణీకరణ, ఆస్తి పన్నులు వసూలు చేయడం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు నిర్వహించడం ద్వారా ఆరోగ్య సంరక్షణ, విద్య, గృహ రవాణా వంటి సేవలను అందించే ఒక రకమైన స్థానిక పాలకమండలి. దీని ద్వారా నీటి సరఫరా, మురుగునీటి నిర్మూలన సంస్థ, హౌసింగ్ బోర్డు, విద్యా , విద్యుత్ శాఖల డిపార్ట్‌మెంట్‌లలో మరింత పురోగతి సాధించే అవకాశం వుంటుంది. అయితే గత పదేళ్ళలో మంచిర్యాల పట్టణ విస్తరణ భారీగా పెరిగింది. దీనికి తోడు గృహ నిర్మాణాలు, జనాభా కూడా అధికమైంది. ఎన్నికలకు ముందు నుండే ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాలను కార్పొరేషన్ చేసే అవకాశాలు ఉన్నాయనేది కాంగ్రెస్ శ్రేణులకు చెపుకొస్తున్నారు. దీని ఏర్పాటుకు పక్కన ఉన్న నస్పూర్ మున్సిపాలిటీతో పాటు, మంచిర్యాల పట్టణానికి ఆనుకొని ఉన్న హాజీపూర్ మండలంలోని 4 గ్రామాలను విలీనం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పంచాయతీ ఎన్నికలకు ముందే..?

సర్పంచ్ ఎన్నికలకు ముందే మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్ చేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు విధి విధానంపై ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి కావల్సిన జనాభా ఎంత అవసరం, ఎక్కడి వరకు పరిధి అనేది నిర్ణయించే పనిలో ఉన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో సుమారు 20వేల గృహాలు, లక్ష వరకు జనాభా ఉన్నట్లు అంచనా, ఇటీవల ఏర్పడ్డ నస్పూర్ పురపాలికలో 22 వేలకుపైగా గృహాలు, 80 వేల వరకు జనాభా వున్నట్లు తెలుస్తోంది. ఇదీ కాక హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కళ్ల, గుడిపేట్, నంనూర్ గ్రామాలను విలీనం చేస్తే సుమారు 30 వేల వరకు జనాభా ఉంటుంది. ఈ నాలుగు గ్రామాలకు సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకుండా త్వరలో కార్పొరేషన్ ఏర్పాటుకు శాసనసభలో బిల్లు పెట్టేందుకు ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి చేయనున్నట్లు ప్రచారం. కార్పొరేషన్ ఏర్పాటుకి అవసరమైన జనాభా సరిపోయే లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే పలు సందర్భాల్లో పరోక్షంగా ప్రకటనలు చేస్తున్నారు. హాజీపూర్ మండలం గుడిపేట్‌లో ప్రభుత్వ స్థలాలు ఎక్కువ ఉండటం పలు ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు ఏర్పాటుకు ప్రకటిస్తున్నారు. మెడికల్, ఐటీ హబ్‌లు ఇక్కడికే తీసుకువస్తానని మొన్నటి ఎన్నికల ప్రచారం సందర్భంగా అక్కడి ప్రజలకు హామీ కూడా ఇచ్చారు. కాగా కార్పొరేషన్ ఏర్పాటుతో వ్యేయ ప్రమాణ స్థాయి పెరుగుతుందని, కొత్తగా ఇండ్లు నిర్మించుకోలేమని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని, కల్తీ విత్తనాలు అరికట్టాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని వామపక్ష రైతు సంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఈ విషయమై సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష రైతు సంఘాల నాయకులు బండి దత్తాత్రి, చిల్క దేవిదాస్, బి.వెంకటనారాయణ, బి.జగన్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 4 లక్షలు ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందన్నారు. దాదాపు పది లక్షల విత్తన సంచులు రైతులకు అవసరమవుతాయన్నారు. ప్రధానంగా రైతుల డిమాండ్ మేరకు 659 రకం విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. కానీ వ్యాపారులు నాసిరకం, కల్తీ విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మేలురకమైన 659 రకం విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఇప్పటికైనా జిల్లా అధికారుల స్పందించి రైతుల డిమాండ్ మేరకు నాణ్యమైన విత్తనాలను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్‌ని ఢీకొట్టిన కారు..బాలుడు మృతి



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని ఫౌజ్‌పూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 ఏండ్ల బాలుడు మరణించిన విషాద సంఘటన జరిగింది. ఎస్ఐ వంగ పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అదిలాబాద్ నుండి నిరాలకు కారులో బాయల్ జగదీష్ పవర్ కృష్ణ(11) తిరిగి వస్తుండగా ముందర ఉన్న ట్రాక్టర్(టీఎస్ 01ఈఎఫ్5540) ట్రాక్టర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనకాల ఉన్న కార్ డ్రైవర్ జగదీష్ చూసుకోకపోవడంతో ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొట్టాడు. స్థానికులు గమనించి 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రులను పరిశీలించిన వైద్యులు హైదరాబాద్‌కు రేఫర్ చేశారు. మంగళవారం బాలుడుని పవర్ కృష్ణ హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. జగదీష్ పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ తెలిపారు. బాలుడు పవర్ కృష్ణ తల్లి పవర్ ఛాయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

మాస్ కాపీయింగ్ పాల్పడుతున్న నందన డిగ్రీ కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో కాకతీయ యూనివర్సిటీ సెమిస్టర్ ఎగ్జామ్ నడుస్తున్నాయన్నారు. కళాశాల యజమాన్యం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ మాస్ కాపీయింగ్ నిర్వహిస్తున్నారని విమర్శించారు. డబ్బులు ఇవ్వకపోతే పరీక్షలు రాయనివ్వకుండా తిరిగి పంపిస్తున్నారని ఆరోపించారు. నందన డిగ్రీ కళాశాల అధిక వసూళ్ల వల్ల చాలామంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకతీయ యూనివర్సిటీ విసీ, కలెక్టర్ స్పందించి, సమగ్ర విచారణ జరిపి కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేసి రూ.ఐదు లక్షల జరిమానా విధించాలని, అలాగే నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో పోరాటలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చంద్రమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని మలక్ చించోలి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధృవపత్రాలు కలిగివుండాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల్లో శాంతియుత వాతావరణం జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-నిర్మల్

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలనీ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియం సమీపంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి తరగతులు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లకు నీటి సరఫరా, స్లాబ్, ప్రహరీ గోడల నిర్మాణం, మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. మహిళా సంఘాలు, విద్యాశాఖ అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం సోఫీనగర్‌లోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తుల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని 52,264 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టెస్కో ద్వారా ఒక జత ఏకరూప దుస్తుల వస్త్రం దాదాపు 1,12, 600 మీటర్లు జిల్లా కేంద్రానికి చేరిందని తెలిపారు. జూన్ 5లోపు విద్యార్థులందరికీ ఒక జత ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మంజులాపూర్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ధాన్యం కొనుగోళ్లను నిరంతరం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్, వంటి వసతులు కల్పించాలని సూచించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అవసరమైన గన్నీ బ్యాగ్స్, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. రోజువారీ ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమాలలో డీఈఓ రవీందర్ రెడ్డి, చేనేత శాఖ ఏడీ రమ్య, సీఎంఓ ప్రవీణ్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి టీటీడీసీలో ఏర్పాటు చేసిన అదిలాబాద్, బోథ్ కౌంటింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి రాజర్షి షా మంగళవారం సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పరిసర ప్రాంతాలలో వాహనాల పార్కింగ్, కౌంటింగ్‌కు హాజరయ్యే ప్రభుత్వ సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఇతర సిబ్బందికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31లోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులకు తలేత్తకుండా తాగునీరు, టెంట్ సౌకర్యం కల్పించాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్, గన్నీ బ్యాగ్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతుల వారీగా కొనుగోళ్లు, సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతి రోజూ ట్యాబ్ ఎంట్రీ చేయాలనీ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, కొనుగోలు చేసిన ధాన్యం వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం కేంద్రాల వారీగా కొనుగోళ్లు, ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎస్ఓ శ్రీకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజి ప్రసాద్, డీసీఓ నర్సయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నవతెలంగాణ-నిర్మల్

ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలని చెప్పి రైతులకు అమ్మడం తీరా అవి సరైన దిగుబడి రాక రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోతున్నారని తెలిపారు. రైతులు నకిలీ, కల్తీ విత్తన ముఠాల బారిన పడకుండా మేలు రకం విత్తనాలు విక్రయించే విధంగా నకిలీ, కల్తీ విత్తనాలు స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. నిర్మల్ జిల్లా పరిధిలో పోలీసు అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని, వానాకాలం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు ప్రయత్నాలు చేయడం జరుగుతుందని తెలిపారు. వారిని అరికట్టడంలో భాగంగా పోలీస్ శాఖ వారు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసిందని తెలిపారు. జిల్లా పరిధిలోని విత్తన, ఎరువుల దుకాణాలను, గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీలు, అనుమానం వచ్చిన విత్తనాల శాంపిల్స్ వెంటనే పరీక్షలకు పంపించడం, రవాణా వాహనాలను కూడా ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేసే వారిపై, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాల జారీ చేశామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా, సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు, మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడం, నకిలీ, కల్తీ విత్తనాల అక్రమ రవాణాను, సరఫరా నిరోధించేందుకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేయడం జరిగిందని తెలిపారు. నకిలీ విత్తన అక్రమార్కులపై పీడీయాక్ట్ అమలు చేయడం జరుగుతుందని ఎస్పీ వివరించారు.

ఎన్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

ఎన్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ముందుగా జెండాను ఎగురవేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పిచ్‌లో కొబ్బరికాయ కొట్టి బ్యాటింగ్ చేసి క్రికెట్‌ను ప్రారంభించారు. క్రికెట్ ఆట ద్వారా ప్రతి ఒక్కరూ తనదైన శైలిలో ప్రతిభను చాటుకోవాలని క్రికెట్ ఆడటం వల్ల మానసికంగా, శారీరకంగా ఉత్సాహాన్ని పెంచుకోవచ్చని అన్నారు, వీరి వెంట మండల నాయకులు, ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, సద్దాం, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



నవతెలంగాణ-కడెం

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని రిజిస్టర్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం టీహెచ్‌ఆర్‌ను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పట్ల వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, పలువురు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులను మంగళవారం టీఏ బాపురావ్ పరిశీలించారు. ఉపాది హామీ చట్టంలో భాగంగా జాబ్ కార్డ్ ఉన్న ప్రతి కూలీలకు పనులు కల్పిస్తామని పేర్కొన్నారు. పనులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఎండాకాలం నేపథ్యంలో కూలీలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సంబాజీ, మెట్‌లు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | మే 22, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఇచ్చోడ



బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి మాతృమూర్తి సోమవారం మరణించింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్, మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట మోహన్‌రెడ్డి, ముస్తఫా, ముండే పాండురంగ్, గాడ్గే సుభాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ గోవింద్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీ, ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోలమన్‌రాజ్, సూపరింటెండెంట్ వెంకట్, రమేష్, సీనియర్ అసిస్టెంట్ భీంరావు పాల్గొన్నారు.

చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు

- నిద్రావస్థలో సంబంధిత శాఖాధికారులు
- రూ.లక్షల్లో వ్యాపారం

నవతెలంగాణ-తలమడుగు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న మండలాలనే టార్గెట్ చేస్తూ అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో మట్టి, మొరం తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. లక్షల్లో సంపాదిస్తూ, అడ్డుకున్న వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులు మాత్రం అటువైపు చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.శరవేగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పెద్దపెద్ద కట్టడాలు, నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటికి మొరం అవసరమవుతుంది. అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొందరు వ్యాపారులు మొరం సరఫరా చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో, ప్రయివేట్ భూముల్లో మొరం తవ్వకాలు జరుపుతున్నారు. మండలంలోని కజ్జర్ల, ఉండం, దేవాపూర్ గ్రామాల చెరువుల్లో అక్రమంగా నల్ల మట్టి తవ్వకాలు జరుపుతున్నట్టు కజర్ల గ్రామస్తులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కజర్ల గ్రామ చెరువులో గత నెల రోజుల నుంచి నాలుగు జేసీబీలతో వందలాది ట్రాక్టర్లు టిప్పర్లతో అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూశాఖ అధికారులు ఏమి పట్టనట్టుగా వ్యవహరించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కజ్జర్ల గ్రామానికి చెందిన యువకుడు సంబంధిత శాఖ అధికారులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించినప్పటికీ స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఆయా గ్రామాల రైతులతో పాటు కొంతమంది నల్ల మట్టిని కమర్షియల్‌గా అక్రమ దందా నిర్వహిస్తున్నారని తెలిపారు. మండలంలో కజ్జర్ల శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా కోట్లాది రూపాయల మొరం తవ్వకాలు రాత్రి, పగలు అని తేడా లేకుండా మొరం తవ్వకాలు జరిపి టన్నుల కొద్ది థారాస్ టిప్పర్లలో తరలిస్తున్నట్టు యువకులు ఆరోపిస్తున్నారు. ఇటు మొరంతవ్వకాలతో తోపాటు చెరువుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు జరిపి రోజుకు లక్షల రూపాయలు మట్టిని తవ్వేస్తున్నట్లు ఆయా గ్రామస్తుల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏండ్ల నుంచి అక్రమంగా మండలంలో మొరంతో పాటు మట్టి తవ్వకాలు జరుపుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నట్టు మండల ప్రజలు పేర్కొంటున్నారు. మండల అధికారులు స్పందించని పక్షంలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మొరం, చెరువుల నుంచి నల్ల మట్టి తవ్వకాల గురించి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.





స్ట్రాంగ్ రూముల వద్ద అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని టీటీడీసీ, సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ భద్రతను, సీసీ కెమెరాల పనితీరును, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతు నేస్తం కార్యక్రమం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరి విత్తనాలలో వివిధ రకాల వంగడాలు వాటి దిగుబడి సామర్థ్యం, వరి కోతలు అనంతరం పంటచెనులో ఉన్న అవశేషాలు తగల బెట్టడం వల్ల జరిగే నష్టాల గురించి, హైదరాబాద్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి మంగళవారం రైతు నేస్తం సమావేశం ఏర్పాటు కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా రైతులు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఏడీఏ విద్యాసాగర్, ముధోల్ ఏడీఏ వీణ, లోకేశ్వరం ఏఓ గణేష్, భైంసా ఏఓ రాంచందర్, కుబీర్ ఏఓ వికార్ అహ్మద్, మండల ఏఈఓలు మౌనిక, భూమేష్, ఉమేష్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

విత్తన దుకాణాల్లో అన్ని రకాల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలని బోథ్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్‌స్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఫర్టిలైజర్‌లో ఉన్న పత్తి విత్తనాలను రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీడ్స్ దుకాణాలలో అన్ని రకాల పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాలని, రైతు కోరిన విత్తనాలను మాత్రమే జీఎస్టీ బిల్లుతో విత్తనాలు అమ్మాలని, ఎమ్మార్పీ అంతకంటే ఎక్కువధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా విత్తన సరఫరాలో ఇబ్బందులు సృష్టిస్తే ఏ కంపెనీని ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలకు భంగం కల్గించే ఏ చర్యను వ్యవసాయ శాఖ సహించబోదని పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో ఏఓ ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రభుత్వ గీత దాటొద్దు



నవతెలంగాణ-భైంసా

గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్సలు నిర్వహిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించవద్దని నిర్మల్ జిల్లా ఆర్ఎంపీ పీఎంపీ అసోసియేషన్ కార్యదర్శి అమ్ముల సాగర్ అన్నారు. మంగళవారం భైంసా మండల కేంద్రంలో నిర్వహించిన భైంసా మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ ఒక్క ఆర్ఎంపీ ప్రభుత్వ గీత దాటావద్దని హెచ్చరించారు, ఆర్ఎంపీలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకునేందుకు తామే ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భైంసా మండల అధ్యక్షులు కదం అర్జున్, ఉపాధ్యక్షులు సునీల్, కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి తుకారాంతో పాటు మండలంలోని కార్యవర్గ సభ్యులు మండల ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

బీసీ కులగణన జరిగిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు

నవతెలంగాణ-బోథ్

బీసీ కులగణన జరిగిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ చందర్‌కు బీసీ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం బీసీ కులగణన చేసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మల్లెపూల సుభాష్, విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం మండల ఉపాధ్యక్షులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెడిచేల్మ ప్రవీణ్, సభ్యులు భీమ, బుచ్చన్న, నవీన్, రమణ, మహేందర్ పాల్గొన్నారు.

టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలి

నవతెలంగాణ-నిర్మల్

టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్ని శాఖల అధికారులకు మంగళవారం ఓ ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, ప్రభుత్వ సంస్థలన్నీ ఇకపై వాటి పేర్లను టీజీతో ప్రారంభమయ్యేలా మార్చుకోవాలని సూచించారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్సైట్లు, ఆన్‌లైన్ వేదికలు, పాలసీ పేపర్లు, జీఓలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని ఆయన ఆదేశించారు. శాఖల ద్వారా భవిష్యత్తులో నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాలలో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని సూచించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై ఈ నెల 25వ తేదీలోపు అన్ని శాఖల అధికారులు నివేదికలు పంపాలని, ఆ నివేదికలు క్రోడీకరించి, ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ మార్కెట్ యార్డులో బుధవారం నుంచి జొన్నల కొనుగోలు ప్రారంభించామని సీఈఓ మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు జొన్నలు అమ్ముకోవాలనుకునే వారు జొన్నల నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, తమ గ్రామ కార్యదర్శి వద్ద టోకెన్ తీసుకొని, హస్నాపూర్‌లోని జొన్నల కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని సూచించారు.

కమిషనర్ మతతత్వ ధోరణికి కౌన్సిలర్ రాజీనామా



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ మతతత్వ ధోరణి వల్ల విసుగు చెంది మంగళవారం ఆరో వార్డు కౌన్సిలర్ అఫ్రిన్ బేగం రాజీనామా పత్రాన్ని మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యంకు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అఫిన్ బేగం అమనుల్లాఖాన్ మాట్లాడుతూ రోడ్డు పై జరుగుతున్న ఆక్రమణలపై మున్సిపల్ కమిషనర్‌కు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకుండా, తామే సమస్యను పరిష్కరించుకోవాలని అనడం, తీరా అక్కడికి వెళ్లి సమస్యను పరిష్కరించుకుంటే మరో బీజేపీ కౌన్సిలర్‌ను అక్కడికి పంపించడం ఇరువురు మధ్య వివాదం సృష్టించడానికి కమిషనర్ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ వర్గానికి చెందిన కౌన్సిలర్ అయిన తనకు బీజేపీ నాయకులతో వివాదాలకు పోతే ఖానాపూర్ పట్టణంలో మత ఘర్షణలు అయ్యే అవకాశం ఉందన్నారు. కమిషనర్ సమస్యను అధికారికంగా పరిష్కరించకుండ ఇరువురు మధ్య గొడవలకు కారణం అవుతున్నారని అన్నారు. ప్రధాన రహదారిపై పెరుగుతున్న ఆక్రమణలను ఆపడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని అన్నారు. కౌన్సిలర్‌గా మా బాధ్యతలు నిర్వర్తించడంలో ఎలాంటి సహకారం అందించకుండా వ్యవహరిస్తున్నందున ఇలాంటి అధికారితో పని చేయడం తమ వల్ల కావడంలేదని అన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమ రాజీనామాను ఆమోదించాలని కోరుతానని అన్నారు.

భక్తి శ్రద్ధలతో పల్లకి ఊరేగింపు

నవతెలంగాణ-తాంసి

ఎంతో భక్తి శ్రద్ధలతో వడ్డాడిలో మంగళవారం లక్ష్మీ నరసింహస్వామి భక్తులు, హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో హిరణ్య కశ్యపుడి బారి నుంచి ప్రహ్లాదుడిని రక్షించడానికి నరసింహుడుగా అవతరించిన రోజు కావటడంతో స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి విఙ్ఞేష్ వేదమంత్రాల నడుమ హోమం, అభిషేకాలు, హారతి వంటి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల్లో హనుమాన్, నరసింహ స్వామి పల్లకీలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీకాంత్, పోతన్న, నాందేవ్, నర్సింగ్‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్థంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయుడు అనేక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించిన మేధావి రాజకీయ వేత్త మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంగళవారం పట్టణంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపుకార్యాలయం ప్రజాసేవాభవన్‌లో రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. తన వినూత్న ఆలోచనలతో పేదబడుగు బలహీన వర్గాలను ఆదుకునేలా అనేక సంక్షేమ పథకాలతో దేశాన్ని కొత్త పుంతలు తొక్కించిన మహానుభావుడని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, మావల ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, మాజీ మున్సిపల్ చైర్మెన్ దిగంబర్‌రావ్ పాటిల్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు గుడిపెల్లి నగేష్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, దర్శనాల లక్ష్మణ్, జాఫర్ అహ్మద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, రామేశ్వర్ నాయకులు బాయిన్‌వార్ గంగారెడ్డి, బూర్ల శంకరయ్య డి.శ్రీలేఖ ఉన్నారు.

ఉట్నూర్ : భారతదేశాన్ని ఏకతాటిపై నిలిపిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇక్బాల్, ఎస్సీ సెల్ నాయకులు దూట రాజేశ్వర్, మాజీ సర్పంచ్ ఆత్రం రాహుల్, అచ్చ దేవానందం, నాయకులు భీమన్న అర్షాద్ బాయ్, ఖలీం, మూతి గంగాధర్, మహబూబ్, అరకిల్ల పరమేశ్వర్‌రావ్, మెస్రం నగేష్, జూబెర్, అబ్రార్ పాల్గొన్నారు.

కడెం : దేశానికి సాంకేతికతను పరిచయం చేయడంతో పాటు దేశానికి ఎంతో సేవ చేసిన వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మండలంలోని మాసాయిపేట్ గ్రామంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షులు గొల్ల వెంకటేష్, నిర్మల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తారి శంకర్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు పడిగెల భూషణ్ పాల్గొన్నారు.

బేల : భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ అతి చిన్న వయసులో భారత ప్రధానిగా అనేక సంస్కరణలు చేశారని, ముఖ్యంగా యువతను రాజకీయాల్లో భాగస్వామ్యం చేయాలని ఉద్యేశంతో 21 సంవత్సరాలకు ఉన్న ఓటు హక్కును 18 సంవత్సరాలకు కుదించడం 1986 నూతన విద్యా విధానం ద్వారా విద్యా రంగంలో అనేక మార్పులు చేయడం జరిగిందని అన్నారు. ఆధునిక భారత సృష్టికర్తగా దేశంలో కమ్యూనికేషన్, కంప్యూటర్ రంగాలలో విప్లవ మార్పును తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, మండల నాయకులు మినక సుధాంరెడ్డి, అనిల్ ధోటే పురుషోత్తం పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ పాలన వ్యవస్థను అట్టడుగు వర్గాలకు కూడా చేరవేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఓటు హక్కును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు కుదించి, దేశ యువతను ప్రజాస్వామ్య పునాదులుగా నిర్మించిన ఘనత రాజీవ్‌గాంధీదే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, ఎంపీటీసీ కుర్మే మహేందర్, నాయకులు షేక్ మహమ్మద్, పసుల చంటి, అబ్రార్, శేఖర్, షేక్ షాకీర్, రహీముద్దీన్, అబ్దుల్ పాల్గొన్నారు.

నిర్మల్ : మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కెఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనేనని అన్నారు. అనంతరం మున్సిపల్ ఛాంబర్‌లో కౌన్సిలర్‌తో కలిసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు నాందేడపు చిన్ను, నాయకులు అల్లూరి మల్లారెడ్డి, మెయిన్, పత్తి రాజేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు భారతజాతి మరువలేనివని ఆయన చివరి శ్వాస వరకు దేశంకోసమే పనిచేశారని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నివాసంలో రాజీవ్ గాంధీ వర్ధంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, సిరికొండ మండలాధ్యక్షులు షేక్ ఇమామ్, యువజన జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, నలిమేల నవీన్‌రెడ్డి, కొరటి ప్రభాకర్, అడెల్లు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జికి సన్మానం

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ సీనియర్ సివిల్ జడ్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జీ.రాధికను జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లా రెడ్డి సన్మానించారు. మంగళవారం కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్‌జడ్జిని సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కవిత, జనరల్ సెక్రటరీ ఓస మహేందర్, కోశాధికారి నర్సారెడ్డి, గేమ్స్ సెక్రటరీ వంశీ, గ్రంథాలయ సెక్రటరీ అర్చన, సీనియర్ న్యాయవాదులు శుభకరన్, గోవర్ధన్, రాజశేఖర్, నూనె గంగాధర్, రాజలింగం, అశోక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజన్న, పోతు శంకర్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-జన్నారం



నిరుపేదల కోసం సీపీఐ(ఎం) దివంగత నాయకులు కే రాజన్న, పోతు శంకర్ సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.పద్మ, జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. మంగళవారం మండలంలోని రాంనగర్‌లో కే రాజన్న, పోతు శంకర్ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కే రాజన్న, పోతు శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేదల కోసం చేసిన ఉద్యమాలలో శంకర్ ఉద్యమ యోధుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కే బుచ్చయ్య, కొండగొర్ల లింగన్న పోతు విజయశంకర్, గుడ్ల రాజన్న పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను రిటర్న్స్ సవరణకు అవకాశం

నవతెలంగాణ-రెబ్బెన

ఆదాయపు పన్ను శాఖ గత ఆర్థిక సంవత్సరాల ఆదాయపు పన్ను రిటర్న్స్ కోసం తప్పుడు పత్రాలను అందజేసి రిఫండ్ పొందిన సింగరేణి ఉద్యోగులకు సవరణ కోసం అవకాశాన్ని కల్పించిందని అధికార ప్రతినిధి ఒక ప్రకటన తెలిపారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో సింగరేణి ఉద్యోగులు ఆదాయపు పన్ను రిటర్న్స్ కోసం టాక్స్ కన్సల్టేన్సీల ప్రలోభాలకు లోనై తప్పుడు పత్రాలు అందించి రిటర్న్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆదాయపు పన్ను శాఖ అధికారులు తెలిపారన్నారు. తప్పుడు పత్రాలు అందించి ఆదాయపు పన్ను మినహాయింపు పొందిన ఉద్యోగులు సరైన పత్రాలు సమర్పించి సరిచేసుకోవడానికి కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉద్యోగులు స్వచ్ఛందంగా సవరణ చేసుకోవాలని లేని పక్షంలో ఆదాయపు పన్ను శాఖ విచారణ అనంతరం చర్యలుంటాయని స్పష్టం చేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 3, 5, 8 తరగతుల ప్రవేశం కోసం అర్హతగల గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల 6వ తేదీ లోపు జిల్లా కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు గెజిటెడ్ సంతకం చేసి సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో అర్హులైన వారిని జూన్ 12న లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందని, వీటిలో 3 సీట్లు పీవీటీజీ తెగకు, 3 సీట్లు ఏజెన్సీ గ్రామాలకు చెందిన విద్యార్థులకు, 27 సీట్లు అన్ని గిరిజన తెగల విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం జిల్లా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాట వద్ద ఘర్షణతోనే యువకుడి హత్య..?



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

మండలంలోని గన్నారంలో సోమవారం పలువురు యువకులు పేకాట ఆడుతుండగా ఏర్పడిన ఘర్షణలోనే మద్యం మత్తులో ఓ యువకున్ని బండరాళ్లతో మోది హతమార్చినట్టు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గన్నారం గ్రామానికి చెందిన పలువురు యువకులంతా కలిసి మందు పార్టీ చేసుకున్నారు. మద్యం మత్తులో గొడవపడ్డారు. గన్నారం గ్రామానికి చెందిన దంపతులు గుర్లె సుగుణ రాములు కుమారుడు చంద్రశేఖర్‌ని మద్యం మత్తులో తోటి మిత్రులే బండరాళ్లతో మోదారని ఆరోపిస్తున్నారు. తలకు బలమైన గాయాలు కావడంతో క్షతగాత్రున్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి, మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఇదే గ్రామానికి చెందిన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఓ యువకుడు హత్య చేసినట్టు పోలీసులు విచారణలో తేలినట్టు సమాచారం. గత కొంత కాలంగా గ్రామానికి అతిసమీపంలోనే యువకులు జూదం ఆడుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్‌ను సంప్రదించగా ఘటన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని భట్టుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భట్టుపల్లి హనుమాన్ ట్రేడర్స్ సమీపంలో లారీ రివర్స్ తీస్తుండగా లారీ ఢీకొని మురళి కుమార్(54) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మురళీ కుమార్ మంచిర్యాలకు చెందిన నివాసిగా రూరల్ ఎస్సై సోనియా పేర్కొన్నారు.

వర్షాకాల వ్యాధులపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-కాసిపేట

వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై పశుపోషకులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ అధికారి డా. రమేష్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల భవనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో పశువులకు గుండెవాపు, జబ్బావాపు, గొర్రెలకు చిటుకు రోగం టీకాలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం వావుదం గ్రామపంచాయతీ ఖప్రి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఎఈ శశిధర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో తరగతులు ప్రారంభం అయ్యేలోగా పాఠశాలలలో పనులు, మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మత్తు పనులను గ్రామ సమైక్య సంఘాల సభ్యుల సహకారంతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుదీకరణ పనులతో పాటు తరగతి గదుల మరమ్మత్తులు, బాలికల కోసం ప్రత్యేకంగా మూత్రశాలలు పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



యూనిఫాంలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఏకరూప దుస్తుల కేంద్రం పరిశీలన

జిల్లా కేంద్రంలోని బజార్‌వాడిలో ఆసిఫాబాద్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా దుస్తుల తయారీకి 78 కేంద్రాలు ఏర్పాటు చేశామని, అధికారులు ఆయా కేంద్రాలను పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేసి పదోన్నతులు కల్పించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా విద్య వ్యవస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి పదోన్నతులు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. సంఘం కార్యకర్తల సమావేశంలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి రాష్ట్రంలో విద్య వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో కేవలం 12 మంది మాత్రమే శాశ్వత ప్రాతిపదికన జిల్లా విద్యాధికారులు పనిచేస్తున్నారన్నారు. డిప్యూటీ జిల్లా విద్యాధికారులు 63 మంది ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 615 మండలాల్లో కేవలం 16 మంది మాత్రమే మండల విద్యాధికారులు పనిచేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఖాళీలను భర్తీ చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. గత అక్టోబర్ లో 774 మల్టీ జోనల్ పోస్టులు పదోన్నతులు పొంది ఆగిపోయాయని వాటిని పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విద్యాధికారి పోస్టులను నియమించాలన్నారు. ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశమున్న నేపథ్యంలో ఖాళీలను వీవీలతో భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పాఠశాలలు ఏర్పాటు చేస్తామనడం స్వాగతించ దగ్గదే అయినప్పటికీ ప్రస్తుతం ఉన్న బడులను బాగు చేయాలన్నారు. పాఠశాలలకు బకాయి ఉన్న విద్యుత్ బిల్లులను మాఫీ చేయాలని లేదంటే పాఠశాల గ్రాండ్ బిల్లులకు కూడా సరిపోదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో రూ. 600 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమని అదే సందర్భంలో గత ప్రభుత్వం ప్రారంభించిన మన ఊరు మనబడి అసంపూర్తి పనులు కూడా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులలో నమ్మకం పెరగాలంటే పాఠశాలలో నమోదు కోసం ఇప్పటినుండే ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌కు తమ సంఘం బాసటగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కేజీబీవీలో పనిచేస్తున్న వారికి బేసిక్ పే ఇవ్వాలన్నారు. పెండింగ్ డీఏ, పీఆర్సీలు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, ప్రధాన కార్యదర్శి ఇందురావ్, ఉపాధ్యక్షుడు హేమంత్ షిండే, కోశాధికారి రమేశ్, నాయకులు తిరుపతి, బాదిరావు, అన్నపూర్ణ, రాజేష్, కిరణ్ పాల్గొన్నారు.

పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 24న జిల్లాలో నిర్వహించే పాలిసెట్ పరీక్షకు ఏర్పాట్లు చేసినట్టు పరీక్ష కన్వీనర్ కనకయ్య తెలిపారు. జిల్లాలో నాలుగు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 216 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 336, గిరిజన గురుకుల కళాశాలలో 240, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో 91 మందిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో 883 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉందని విద్యార్థులు పరీక్షకు ముందుగానే సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం తన ఫోన్ 9912596756 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లోనవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ధీకొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లోనవెల్లికి చెందిన ధర్మరాజుల గోపాల్ (26)కు మూడు సంవత్సరాల క్రితం వేమనపల్లి మండలానికి చెందిన వనితతో వివాహం అయింది. వీరికి ఒక చిన్న పాప ఉంది. గోపాల్ తరచూ మద్యం సేవించి ఇంటికి వస్తుండేవాడు. తండ్రి నాగయ్య, భార్య వనిత మద్యం అధికంగా ఎందుకు సేవిస్తున్నావని తరచూ మందులు ఇచ్చేవారు, నేను మద్యం సేవించకపోతే చనిపోతానని బెదిరించేవాడు. మంగళవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి రావడంతో తండ్రి, భార్య మందలించారు. ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని తాడుతో ఉరి వేసుకున్నాడు. భార్య తన పాపకు స్నానం చేయించి ఇంట్లోకి రావడానికి తలుపులు తీయడానికి యత్నించగా రాకపోవడంతో మృతుని తమ్ముడు అటకపై నుండి లోపలికి చూశారు. ఉరేసుకొని కనిపించాడు. గోపాల్‌ను సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యుల పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఎంపీటీసీలతో పాటు అధికారులు వారి ప్రగతి నివేధికలతో సకాలంలో హాజరు కావాలన్నారు.

కొడుకులు బువ్వ పెడుతలేరు

నవతెలంగాణ-మంచిర్యాల

కని పెంచిన కొడుకులు బువ్వ పెడుతలేరని, ఉన్న భూమిని ఎవరిది వారు పంచుకొని నన్ను బయటకు గెంటేశారంటూ మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసిందో వృద్ధురాలు. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల పట్టణంలోని చింతపండు వాడకు చెందిన సామంతుల గోపమ్మకు 5 గురు కొడుకులు ఒక కుమార్తె ఉన్నారు. భర్త కొన్ని సంవంత్సరాల క్రితం మరణించాడు. అనంతరం కొడుకులకు తన భూమిని పంచి ఇచ్చింది. కొన్ని రోజులుగా తల్లి సంరక్షణను మరిచి ఆమెను ఇంటి నుండి బయటకు పంపించారు. ఇందే విషయమై వృద్ధురాలు పట్టణ సిఐ బన్సీలాల్‌కు ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె కొడుకులు, కోడళ్ళను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి మరోసారి అలా చేయకుండా మందలించి పంపించారు. వృద్ధురాలి దీన స్థితికి స్పందించిన మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది వృద్ధురాలికి 25 కేజీల రైస్ బ్యాగ్ అందించారు.

జర్నలిస్టుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణానికి చెందిన జర్నలిస్టు అంగల తిరుపతిపై దాడి చేసిన అక్రమ మైనింగ్ నిర్వాహకుడు కలీంపై కఠిన చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాలు అందించారు. ముందుగా ప్రెస్‌క్లబ్ సభ్యులు డీఎస్పీ కరుణాకర్‌ను కలిసి పరిస్థితి వివరించారు. వార్తా సేకరణకు వెళ్లిన తిరుపతిపై కలీం అతని అనుచరులు విచక్షణారహితంగా దాడి చేశారనీ, పైగా అతనే పోలీసుస్టేషన్‌కు వెళ్లి తిరుపతిపై ఫిర్యాదు చేసి భయాందోళనకు గురి చేశాడని ప్రెస్‌క్లబ్ సభ్యులు వివరించారు. అతని ఫిర్యాదు ఆధారంగా తిరుపతిపై కేసు నమోదు చేయకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని జర్నలిస్టులు కోరారు. తిరుపతి చేసిన ఫిర్యాదు మేరకు కలీం, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాలలో అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా కొనసాగుతోందనీ, దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందని ఆర్డీఓకు వివరించారు. స్పందించిన ఆర్డీఓ వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుపై దాడి సరైంది కాదని, దీనిని ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కిరణ్‌ను కూడా కలిసి పరిస్థితి వివరించారు.

దాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలి : ఎమ్మెల్యే హరీష్‌బాబు

జర్నలిస్టు తిరుపతిపై దాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలని సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ నుండి మాట్లాడిన ఆయన నియోజకవర్గంలో కొన్నేళ్లుగా అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా కొనసాగుతోందని, దీనిని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. తిరుపతిపై దాడి చేసిన కలీం, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



కాగజ్‌నగర్ : ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

దాడికి కారకులను అరెస్ట్ చేయాలి: సీపీఐ(ఎం)

జర్నలిస్టు తిరుపతిపై దాడికి కారకులను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ(ఎం) సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించి వార్తా కవరేజీకి వెళ్లిన విలేకరిపై దాడి చేయడం సరైంది కాదన్నారు.

అక్రమ మైనింగ్‌ను ప్రోత్సహిస్తున్న అధికారులు : సీఐటీయూ

అక్రమ మైనింగ్‌ను అధికారులు ప్రోత్సహించడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనింగ్ మాఫియాను అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ప్రారంభంలోనే అధికారులు కఠిన చర్యలు తీసుకొని ఉంటే శాంతిభద్రతల సమస్య ఏర్పడేది కాదన్నారు. జర్నలిస్టుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : టీడీపీ

జర్నలిస్టుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలుగు దేశం ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్ చేస్తూ జర్నలిస్టులపై దాడి చేయడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.

మితిమీరుతున్న మైనింగ్ మాఫియా ఆగడాలు : ప్రజాసంఘాల ఐక్యవేదిక

కాగజ్‌నగర్ చుట్టు పక్కల ప్రాంతాలలో అక్రమంగా కొనసాగుతున్న మైనింగ్ మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు అల్లి రాజయ్య, అంబాల ఓదేలు, బి నర్సయ్య, ఎం జయదేవ్ అబ్రహం, నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనింగ్ మాఫియా గురించి నిత్యం పత్రికలలో వస్తున్నా అధికారులు స్పందించడం లేదని, జర్నలిస్టుపై జరిగిన దాడికి కారకులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



దహెగాం : తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

దహెగాం : కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విలేఖరి అంగల తిరుపతిపై అక్రమ మైనింగ్ నిర్వాహకుడు కలీం, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని దహెగాం ప్రెస్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలను అందజేశారు. సిర్పూర్ తాలూకాలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ మాఫియాకు మద్దత్తు ఇస్తున్న జిల్లా అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విలేకరులు ముఖషీర్ పాషా, నామ తిరుపతి, ప్రవీణ్ గౌడ్, రాకేష్, వెంకన్న పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విలేఖరిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిర్పూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మొబీన్, హెడ్ కానిస్టేబుల్ వీరయ్యలకు ఫిర్యాదు చేశారు. వార్త సేకరణకు వెళ్లిన పాత్రికేయులపై దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పైడి సంతోష్, నజీర్, కార్యదర్శి ధనంజయ, జమీల్, రిజ్వాన్, శ్రీధర్, ప్రసాద్, రవి, హరి పాల్గొన్నారు.

పెంచికల్ పేట్ : జర్నలిస్ట్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పెంచికల్‌పేట ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు జునుగరి కమలాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. జర్నలిస్టుల హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో విలేకరులు రాజేష్, చిరంజీవి, శ్రీధర్, సందీప్, ప్రశాంత్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ మండలం చారిగాం ప్రాంతంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అక్రమ మైనింగ్ (మొరం తవ్వకాలు) వార్త సేకరణకు వెళ్లిన విలేకరిపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగా మాలశ్రీ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వార్త సేకరణ కోసం వెళ్లిన విలేకరిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. చేసేదే అక్రమ మైనింగ్ అయినప్పటికీ వార్త సేకరణకు వెళ్లిన విలేకరుల పట్ల దుర్భాషలాడుతూ దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. మైనింగ్ స్మగ్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

విలేకరిపై దాడి, అప్రజాస్వామికం

అక్రమ మొరం తవ్వకాల వార్త సేకరణకు వెళ్లి విలేకరి అంగల తిరుపతిపై మైనింగ్ నిర్వాహకులు దాడి చేయడం అప్రజాస్వామికమని, దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చారిగాం శివారులో జేసీబీ ట్రాక్టర్లతో ఇష్టారీతిన అక్రమ మైనింగ్ కొనసాగుతున్నా అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారన్నారు. ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సించం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తు అశోక్, ఈర్ల విశ్వేశ్వరరావు, తాలుకా కన్వీనర్ వీరభద్రచారి, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు వలస శ్రీదేవి, దెబ్బటి శ్రీనివాస్, ఠాకూర్ విజ్జంగ్, గజ్జల లక్ష్మణ్, చిప్పకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిర్పూర్(టి): తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న విలేకరులు



కాగజ్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రానికి చెందిన షేక్ అంకూష్ అనే బీఆర్ఎస్ కార్యకర్త గత నాలుగు నెలల క్రితం వాగులో పడి మృతి చెందగా బీఆర్ఎస్ సభ్యత్వంతో ఇన్సూరెన్స్ కింద రూ.2 లక్షలు మంజూరు కాగా చెక్కును షేక్ అంకూష్ భార్య షేక్ చాంద్ బీకి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలమని, అలాంటి కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మి, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, నాయకులు చింతల భీమయ్య, మడిపల్లి తిరుపతి, బుగ్గ రాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిక పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గుండ్లపాడు, దుబ్బగూడెం గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలకు ఆదివాసి సేన వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండలు అధికంగా ఉండడంతో తమ వంతుగా ఉపాధి కులీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. అనంతరం నూతన జాబ్ కార్డు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిలో మ్యాన్ రైడింగ్ తనిఖీ



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌లిఫ్ట్ మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌ను బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం కె రఘు కుమార్, బెల్లంపల్లి రీజియన్ ఈ అండ్ ఎం సేఫ్టీ జీఎం రామానందంతో కలిసి కార్పోరేట్ సేఫ్టీ జీఎం కె గురువయ్య తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా కార్పోరేట్ సేఫ్టీ జీఎం కె గురువయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. చైర్ లిఫ్ట్ మ్యాన్ రైడింగ్ ఆపరేటింగ్‌లో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు, రక్షణ సూచనలు వివరించారు. విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు తప్పకుండా పాటించాలని, దీని ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ అధికారి ఎం.రవీందర్, గని అధకారులు పాల్గొన్నారు.

కుల గణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు

- బీసీ ఐక్య వేధిక నాయకుల డిమాండ్



నవతెలంగాణ-జైపూర్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీ కుల గణనచేపట్టాలని బీసీ ఐక్య వేదిక జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ ఐక్య వేదిక నాయకులు తహసీల్దార్ వనజారెడ్డికి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని, స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన తీరును గుర్తు చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసెంబ్లీలో కుల గణన చేపడుతున్నట్లు సీఎం రేవంతర్‌రెడ్డి ప్రకటించటప్ల కృతజ్ఞతలు తెలిపారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని పక్కన పెట్టి జూన్ చివరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ ఖరారు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈ సంధర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేధిక నాయకులు నీరటి రాజన్న, చెలిమల అంజన్న, మార్త మారుతి, ఆవిడపు గణేష్, వేముల మల్లేష్, కళ్యాణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రైతులకు జీలుగా జనుము విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు, మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో, జనుము విత్తనాలు పీఏసీఎస్ పొనకల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలుగులు విత్తనాల బస్తా ధర రూ.1116, జనుములు బస్తా ధర రూ.1448 చెల్లించి తీసుకోవచ్చ అన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం రైతు ఆధార్ జిరాక్స్, పట్టాపాస్బుక్ జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, కొనుగోలు కేంద్రాలలోఇవ్వాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-1 గనిలో సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం గని మేనేజర్ శంకరయ్యకు వినతి పత్రం అందించారు. గనిలో కార్మికులకు తాగునీటికి చాలా ఇబ్బంది కలుగుతుందని, గనిలో పూర్తి స్థాయి గదులు నిర్మించేంత వరకు తాత్కాలిక బైక్ షెల్టర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెస్ట్ హాల్ మెయింటైనెన్స్ చేయించాలని, ల్యాంప్ రూములో తగినన్ని స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచాలని, ఎలక్ట్రీషన్ ఫిట్టర్లకు అన్ని డిస్ట్రిక్టకు హెల్పర్లను కేటాయించాలని, లైన్మెన్లకు సరిపడా కీలలు, గిర్ మిట్లు ఇవ్వాలని, సర్ఫేస్‌లో డ్యూటీ అనంతరం కాళ్లు చేతులు కడుక్కునేందుకు తగినన్ని పంపులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పిట్ కార్యదర్శి దెబ్బటి తిరుపతి, బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకట స్వామి, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, ఆర్గనైజర్ భేతి భరత్, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, కందుగుల రమేష్, పిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ గణేస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ లైనప్ల మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని దౌడపల్లి, మోదెల, చందారం, వెంకట్రావుపేట్, పోతపల్లి 11 కేవీ ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ఆదివాసులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- టీఏజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ పున్నం



నవతెలంగాణ-జన్నారం

కిడ్నాప్ చేసి జైలుకు పంపించిన కోలం గిరిజన ఆదివాసి బిడ్డ ఆత్రం రాజును విడుదల చేయాలని, ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ పున్నం అన్నారు. మంగళవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తపాలాపూర్ గ్రామం కొలంగూడాలో అటవీ అధికారులు ఈనెల 17న ధ్వంసం చేసిన ఆదివాసి గుడిసెలు, పోచమ్మ ఆలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అధికారులు ఆత్రం రాజు ఇంటిని, ఇంట్లో ఉన్న వంట సామాగ్రి, వస్తువులను ధ్వంసం చేసిన అటవీ అధికారులపైన కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కరెంటు స్తంభాలను ధ్వంసం చేసి కరెంటు తీగలను ఎత్తుకుపోయిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ శాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఆదివాసులపైన కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని అన్నారు. పీవీటీజీకి చెందిన ఆత్రం రాజుని ఎవరికి తెలియకుండా కిడ్నాప్ చేసి లక్షెట్టిపేట జైలుకు పంపించడాన్ని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తను అనేక సంవత్సరాల కాలంగా అక్కడే నివాసం ఉంటున్నాడని, ఆదివాసీల దైవం భీమన్న దేవర, పోచమ్మ తల్లి ఆలయాలను అటవీశాఖ అధికారులు జేసీబీతో ధ్వంసం చేసి, ఇంటిని పూర్తిగా తొలగించడం సరికాదన్నారు. కిడ్నాప్ చేసి జైలుకు పంపించిన ఆత్రం రాజును బేశరతుగా విడుదల చేయాలని, వారి ఆస్తులను ధ్వంసం చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన ఆత్రం రాజును వెంటనే విడుదల చేయాలని లేనియెడల జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్‌కే అబ్దుల్లా మండల కార్యదర్శి అడయి యశోద, నాయకులు దోసండ్ల ఎల్లయ్య, పోషం, రమేష్, వెంకటేష్, శైలజ, రజిత, సొంబాయి, పార్వతి, అర్జుబాయి, విజయ్, శ్రీనివాస్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

పోడును గుర్తించే వరకు హద్దులు వద్దు

- అటవీ అధికారులతో అంకుషాపూర్ శివారు రైతుల వాగ్వివాదం



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలంలోని అంకుషాపూర్ శివారులో పోడు భూములను గుర్తించే వరకు అటవీ ప్రాంతంలో హద్దులు ఏర్పాటు చేయవద్దని, ఆ గ్రామానికి చెందిన పోడు రైతులు డిమాండ్ చేశారు. అంకుషాపూర్ గ్రామ శివారు సరిహద్దు అటవీ ప్రాంతంలో మంగళవారం ట్రెంచ్ పనులు చేపట్టిన అటవీ అధికారులతో గ్రామస్థులు వాగ్వివాదానికి దిగారు. పోలంపల్లి గ్రామ పంచాయతి పరిధిలో గల 300 కుటుంబాలు గత 50 సంవత్సరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని పోడు భూములను అటవీ అధికారులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెం.140లో గల పోడు భూమిలో మిషన్ కాకతీయ పథకం ద్వార నిర్మించిన చెరువును సైతం అటవీ అధికారులు ఆక్రమించుకునే కుట్ర చేస్తున్నారని గ్రామానికి చెందిన ఆకుదారి రాజం, కోట పోషం, రంపాల్, దుర్గం రాములు, సెగ్గ్యం అర్జయ్య, కుమ్మరి శ్రీనివాస్, దుర్గం రామోహన్, దర్శనాల రమేష్, కామెర నరేందర్ ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలో పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేయడం కోసం తీసుకున్న నిర్ణయంలో భాగంగా భీమారం మండల పరిధిలో ధర్మారం, భూర్గుపల్లి, పోలంపల్లి, అంకుషాపూర్ శివారుల్లో పోడు వ్యవసాయం చేస్తున్నట్లు గుర్తించారని తెలిపారు. ఈ క్రమంలో ఎఫ్ఆర్‌సీ కమిటీలు ఏర్పాటు చేసి పోడు భూములు సర్వే చేయడంతో పాటు రైతుల వద్దన గల రికార్డులను సరిపోల్చి చూసినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వార పట్టాదార్ పాసు పుస్తకాలతో పాటు ఫస్ట్ అండ్ ఫైనల్ పట్టాలు పొందిన రైతుల కొందరైతే తాత ముత్తాతల నుండి పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులు మరికొందరు పోడు భూముల్లో పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. పోలంపల్లి, అంకుషాపూర్ శివారుల్లో గల పోడు భూములను రైతుల నుంచి ఆక్రమించుకోవడం కోసం అటవీ అధికారులు ఉద్దేశపూర్వంగా అభివృద్ధి పనుల పేరుతో ఆక్రమించుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసువెల్తామని పేర్కొన్నారు.

అడ్డుకోవడం సరికాదు

రత్నాకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మంచిర్యాల.

అంకుషాపూర్ శివారు కుందారం అటవీ ప్రాంతం పరిధి కంపార్ట్‌మెంట్ నెంబర్ 50 పరిధిలో ఎలాంటి రెవెన్యూ భూమి లేదు. ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న సరిహద్దు అటవీ ప్రాంతం కంపార్ట్‌మెంట్‌లో ఎక్కడ కూడా పోడు భూములు లేవు. పోడు భూములుగా పేర్కొంటున్న ప్రాంతాన్ని వదిలి రక్షిత అటవీ ప్రాంతంలో చేపట్టిన ట్రెంచ్ పనులను అడ్డుకోవడం సముచితం కాదు. అభివృద్ధి పనులకు అడ్డుపడి అటవీ ప్రాంతాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడం చట్ట విరుద్ధం. అటవీ రికార్డులతో పాటు రెవెన్యూ రికార్డులు పోల్చి చూసి అటవీ ప్రాంతంగా గుర్తించి అటవీ భూములు ఆక్రమణను అడ్డుకోవడం కోసం హద్దులు ఏర్పాటు చేస్తున్నాం. అటవీ ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి.

మహనీయుల ఆశయాలు కొనసాగిద్దాం

- సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా రాజన్న, శంకర్‌ల వర్ధంతి



నవతెలంగాణ-జైపూర్

జీవిత కాలాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహనీయుల ఆశయాలు కొనసాగిద్దామని సీపీఐ(ఎం) నాయకులు పిలుపునిచ్చారు. చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారులో కొనసాగుతున్న భూపోరాట కమిటి నాయకులతో కలిసి మంగళవారం సీపీఐ(ఎం) నాయకులు కనికరపు రాజన్న, పోతు శంకర్‌ల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ రాజన్న, శంకర్‌లు జన్నారం మండల కేంద్రంలో ఉంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో అనేక భూపోరాటాలు చేసి నిరుపేదలైనటువంటి వారికి భూములు ఇప్పించిన మహనీయులని పేర్కొన్నారు. ఇంటి స్థలం లేనటువంటి పేదలతో కలిసి ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తూ వందకుపైగా కేసుల్లో ఉండి నిరంతరం ప్రజల శ్రేయస్సు కోరిన మహనీలయులని కొనియాడారు. రాజన్న, పోతు శంకర్‌ల ఆశయాల కోసం వారి అడుగుజాడల్లో నడుచుకుందామని ఈ సంధర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బావురావుపేట్ భూపోరాట కమిటి నాయకులు రాతిపల్లి నాగేష్, ఉమారాణి, సిడం సమ్మక్క, నాగజ్యోతి, యామిని, రమాదేవి, అనసూర్య, మధూకర్, సమ్మయ్య, జమున, శ్యామల,ఎల్లక్క, మాంతక్క, సమ్మయ్య, సూర్యమాల తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో..

జన్నారం : మండలంలోని సుందరయ్య నగర్ కాలనీలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మగ్గిడి జయ ఆధ్వర్యంలో మంగళవారం పేదల పక్షాన పోరాటం చేసి అసువులు బాసిన సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కె రాజన్న, పోతు శంకర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మగ్గిడి జయ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా సీపీఐ(ఎం) ద్వారా అనేక పోరాటాలు చేసి పేదలకు వ్యవసాయ భూములతో పాటు ఇండ్ల స్థలాలు ఇప్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు శారద, పద్మ, సత్తవ్వ, నిత్య, అక్షయ పాల్గొన్నారు.

నెలాకరులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియను నెలాకరులోగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మికశాఖ అధికారి కృష్ణాదిత్య అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్లు బదావత్ సంతోష్, వెంకటేష్ ధోత్రే, మంచిర్యాల అదనపు కలెక్టర్ బి.రాహుల్, సబావత్ మోతిలాల్, దాసరి వేణులతో కలిసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం నీడ, తాగునీరు ఇతర సదుపాయాలు కల్పించడంతో పాటు ఓఆర్ఎస్, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. తూకము చేయడానికి వినియోగించే కాంటా, బాట్లు, తేమ శాతాన్ని పరిశీలించే మాయిశ్చర్ మీటర్, గన్నీ సంచులు సమకూర్చాలని, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవాలని అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం తూకం చేయడానికి ముందే సంబంధిత రైతు వద్ద నుండి కూపన్, బ్యాంక్ ప్రతి కొనుగోలు కేంద్రాన్ని అవసరం మేరకు 15 నుండి 20 టార్పాలిన్లు అందించాలని, కొనుగోలు వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-జన్నారం

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి బ్యాంకింగ్ వ్యవస్థ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వ్యవస్థ తీసుకొచ్చిన రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. ఆయన భారతదేశానికి చేసిన సేవలు మరువలేని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, ఇసాక్ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, ఎంపీటీసీ ఎండీ రియాజోద్దీన్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : దేశాన్ని సాంకేతిక విద్య వైజ్ఞానిక రంగాలలో ముందుకు తీసుకెళ్లిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్ గాంధేనని కాంగ్రెస్‌నాయకులు పునరుద్ఘాటించారు. పట్టణ కేంద్రంలో నిర్వహించిన దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ 34 వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతా అశోక్, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్, మైనార్టీ మండల అధ్యక్షుడు నవాబ్ ఖాన్, సయ్యద్ హాజీ, ఆమీర్, నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, మడిపల్లి సామి పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలో గుర్తించిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు మే 31 లోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహూల్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో గల కుందారం, ఇందారం, గంగిపల్లి, దుబ్బపల్లి, వెంకట్రావ్‌పల్లిల్లో పర్యటించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న పనులను పరిశీలించిన ఆయన త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం సమీపిస్తున్నందు విద్యార్థుల సౌకర్యార్థం పనుల నిర్వాహణలో ఎలాంటి లోపం లేకుండా పాఠశాలలను పూర్తి స్థాయిలో సంసిద్ధం చేసి ఇవ్వాలని తెలిపారు. పనుల నిర్వాహణలో గల లోటుపాట్లను స్థానిక ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ, ఇర్రిగేషన్ జేసీ శశాంక్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య పరిక్షలు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, కార్మికులకు హైదరాబాద్‌లో గల అమోర్ ఆసుపత్రి ద్వార ఉచితంగా వైద్య పరిక్షలు నిర్వహించనున్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ అమోర్ ఆస్పత్రి ప్రధాన వైద్యులు నాగేందర్‌రావును కలిసిన నాయకులు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను వైద్యులతో చర్చించినట్లు తెలిపారు. ప్రధానంగా గుండె, నరాలు, ఎముకలు, ఊపిరితిత్తులు, మూత్రకోశ వ్యాదులతో రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ విషయమై స్పందించిన వైద్యులు నాగేందర్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, వై జంక్షన్, హైదరాబాద్, బాలానగర్, మెట్రో స్టేషన్ సమీపంలో గల అమోర్ ఆస్పత్రుల ద్వార త్వరలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సింగరేణి ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బూపెల్లి బానయ్య, ఆళవందార్ వేణుమాధవ్, విజయబాబు, రాజన్న, ఆసుపత్రి పీఆర్వో కళ్యాణ్ పాల్గొన్నారు.

యాదవులను ఆదుకోవాలని వినతి

నవతెలంగాణ-నస్పూర్

గొర్రెలు ఇస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందని ఇప్పటికైనా యాదవులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో భీమిని మండల యాదవ కులస్థులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తుల మధుసూదన్ రావు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో గొర్రెల కోసం డీడీలు గత ప్రభుత్వానికి కట్టారని గొర్రెలు ఇవ్వడం గానీ, నగదు తిరిగి ఇవ్వడం జరగలేదన్నారు. ఒక్కొక్కరి దగ్గర రూ.43,750 వసూలు చేశారని, ఈ విధంగా ఆ ఒక్క గ్రామం నుండే దాదాపు 83 మంది వద్ద నగదు వసూలు చేసి వారికి గొర్రెల పంపిణీ చేయకుండా మోసం చేసిందని అన్నారు. ఈ సమస్య భీమిని మండలంలోని చిన్నగుడిపేట ఒక గ్రామంలోనే కాదని ఇది రాష్ట్రమంతా ఉన్న గొర్ల కాపరుల అందరి సమస్య అని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రమంతా ఈ విధంగా గొర్ల కాపరులను మోసం చేస్తే, ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా న్యాయం చేస్తారేమోనని ఆశతో వారు ఎదురు చూశారని అన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వీరి సమస్యను ఒక సమస్యగా కూడా చూడకపోవడం బాధాకరమైన అంశం అన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను, నిరుపేదలను, గొర్ల కాపరులను పట్టించుకోకపోతే వారికి కూడా బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకుడు ఎస్.ఆర్ బోస్, గోపు మల్లయ్య, ఐలయ్య, మురికి బీరయ్య, మోధిగిరి రాజ్ కుమార్, రాచ బీరయ్య, బానోతు దాస్య పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కళాశాలలు, పాఠశాలల అడ్మిషన్ల నోటిఫికేషన్లు విడుదలైన క్రమంలో ఉన్నతంగా చదువుకొని సీట్లు సాధించాలని సూచించారు. ఆదివాసీ విద్యార్థులు తప్పుడు దారిలో వెళ్లకుండా ఉన్నతంగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. గ్రామాల్లో ఆదివాసీ విద్యార్థులకు ఆదివాసీ నాయకులు చదువులపై అవగాహన కల్పించాలని కోరారు.